సాక్షి
పల్నాడు
గురువారం । 15 । ఆగస్టు । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ బుధవారం సాయంత్రానికి 40.77 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు గేట్లు మొత్తం మూసివేశారు.



కాల్వ పూడికతీత

కారెంపూడి: స్థానిక పెదకొదమగుండ్ల మేజర్ కాల్వలో బుధవారం కాల్వ చివరి భూముల రైతులు పొక్లెయిన్‌తో పూడిక తీత పనులు నిర్వహించారు.



49,968 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 49,968 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 47,894 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

సర్కారు ఆస్పత్రికి సమస్యల సుస్తీ

- నరసరావుపేట ఏరియా ఆస్పత్రిని వేధిస్తున్న సమస్యలు
- రేడియాలజిస్టు లేక మూలనపడిన యంత్రాలు
- ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు వెళ్తున్న గర్భిణులు
- మెరుగైన చికిత్సకు గుంటూరు జీజీహెచ్‌కు రాస్తున్న వైద్యులు
- మందులు సైతం బయటకే..
- రెండు నెలలుగా నిధులు రాక అందుబాటులో లేని సర్జికల్ వస్తువులు
- గర్భిణుల బ్లాక్‌లో పనిచేయని జనరేటర్
- రోగులను బంధువులే స్ట్రెక్చర్ పై తోసుకువెళ్తున్న వైనం
- సరిపడా బల్లలు లేక నేలపై కూర్చుంటున్న రోగులు
- 'సాక్షి' పరిశీలనలో వెలుగులోకి వచ్చిన అంశాలు

చేతిలో చిల్లి గవ్వలేక ప్రభుత్వాసుపత్రి మెట్లు ఎక్కితే.. పనిచేయని పరికరాలు పేదోడి జబ్బును వెక్కిరిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన ఉచిత వైద్య సేవలంటూ కూటమి నేతలు చెబుతున్న మాటలు ఆస్పత్రిలో స్ట్రక్చర్ పై మూలుగుతున్న రోగుల వేదనలో కలిసిపోతున్నాయి. కడుపు నింపుకోవడం కోసం చెమట చుక్కలు చిందించే శరీరానికి జబ్బు చేస్తే.. పరీక్షలన్నీ ఖరీదుకేనంటూ పేదలను పరీక్ష పెడుతున్నాయి. ధర్మాసుపత్రికదా అని వస్తే ఇంజక్షన్లు, మందుల చీటీలు చేతిలో పెట్టి అవి తెస్తేనే వైద్యం అంటూ నిస్సహాయతను ప్రశ్నిస్తున్నాయి. ఇద్దరికి చాలని బెడ్లు, తిరగని ఫ్యాన్లు, గంటలకొద్దీ క్యూలైన్లు సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఇదీ నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాల దుస్థితి. ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న సేవలపై 'సాక్షి' బృందం చేసిన పరిశీలనలో పలు లోపాలు వెలుగులోకి వచ్చాయి.

సాక్షి, నరసరావుపేట నెట్‌వర్క్: పేదోడికి ఉచితంగా సేవలు అందించే ప్రభుత్వ ఆసుపత్రికే జబ్బు చేసింది. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్యంపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ అధ్వానంగా మారి రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మాచర్ల, బొల్లాపల్లి లాంటి సుదూర ప్రాంతాల నుంచి నరసరావుపేట ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్న వారికి మెరుగైన వైద్యం అందడం లేదు.

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

820 ఓపీ నమోదు..

లింగంగుంట్లలోని కలెక్టరేట్‌కు సమీపంలో గల 200 పడకల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో జనరల్ మెడిసిన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఆర్థో, అప్తమాలజీ, పీడియాట్రిక్, గైనకాలజీ విభాగాలకు చెందిన వైద్యులు ఉన్నారు. 820మంది రోగులు జిల్లాలోని వివిధ ప్రదేశాల నుంచి ఓపీ ద్వారా వైద్యం చేయించుకున్నారు. రోజుకు కనీసంగా 750 నుంచి 850 మంది వరకు ఓపీ నమోదు చేసుకుంటారు. ఓపీ నమోదు వద్ద చాంతాండంత క్యూ కనిపించింది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా 178మంది ఉన్నారు. జనరల్ మెడిసిన్‌కు ఇద్దరు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఒకరు, ముగ్గురు పీడియాట్రిక్ డాక్టర్లు, ఐదుగురు గైనకాలజీ విభాగం డాక్టర్లు, ఆర్థో విభాగంలో ముగ్గురు, డెప్యూటీ సివిల్ సర్జన్ ఒకరు ఉన్నారు.

కూటమి వైద్యం.. పేదలకు శాపం



నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్త పరీక్షల కోసం క్యూలో వేచిఉన్న రోగులు



నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాల భవనం

గర్భిణులకు తప్పని ఇక్కట్లు..

నరసరావుపేట ఏరియా వైద్యశాల గైనిక్ విభాగానికి వైద్యం కోసం వచ్చిన గర్భిణులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఎన్నో వ్యయప్రయాసలతో వైద్యశాలకు వచ్చిన గర్భిణులు, బాలింతలకు తిప్పలు తప్పడం లేదు. మెరుగైన వైద్యసేవలు మచ్చుకైనా కనిపించడం లేదు. కార్పొరేట్ వైద్యశాలలకు ఏమాత్రం తీసిపోకుండా రోగుల జేబులు గుల్లవుతున్నాయి.

జనరేటర్ మూలకు..



మరమ్మతులకు గురైన జనరేటర్

కాన్పుల వార్డులో ఉన్న జనరేటర్ మరమ్మతులకు గురవడంతో పక్కనపడేశారు. రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకురావాలంటే నిధులు లేని కారణంగా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్ అంతరాయ సమయంలో రోగులు, గర్భిణులు తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. దీంతో చెట్ల కిందకు వచ్చి సేదతీరడం కనిపించింది. గర్భిణులకు శస్త్రచికిత్సల సమయంలో కరెంట్ కోత ఏర్పడితే ఇబ్బందులు తీవ్రతరమవుతాయి.

ఫ్యాన్ తెచ్చుకున్నా...



రక్తహీనతతో పాటు వెన్నునొప్పి కారణంగా ఆసుపత్రిలో చేరాను. ఇన్‌పేషెంట్ మహిళా వార్డులో నాలుగు రోజులుగా వైద్యసేవలు పొందుతున్నాను. ఇక్కడ వార్డులో ఫ్యాన్‌లు కూడా సరిగ్గా తిరగడం లేదు. గాలి లేకపోవడంతో పాటు ఉక్కపోత కారణంగా నిద్ర కూడా పట్టడం లేదు. దీంతో ఇంటి నుంచి టేబుల్ ఫ్యాన్ తెప్పించుకొని పెట్టుకున్నాను.

- కుమారి, కుంకలగుంట

షుగర్ మందులు లేవు



ఒంట్లో నలతగా ఉండటంతో ఆసుపత్రికి వచ్చాను. డాక్టర్ గారు పరీక్షలు చేసి షుగరు పెరిగిందని మందులు రాశారు. మూడు రకాల మందులు డాక్టర్ గారు రాస్తే ఒక రకం మాత్రమే ఇక్కడ ఇచ్చారు. ఇంజక్షన్ తో పాటు మరో రకం మందులు బయట తెచ్చుకోమని చెప్పారు.

- పి.నాగరాజు, నరసరావుపేట

ఎదురుచూస్తున్నా...



కంటి సమస్యతో డాక్టర్ గారి దగ్గర చూపించుకుందామని వచ్చాను. ఒక డాక్టర్ సమస్య అడిగి తెలుసుకొని కంటి పరీక్షలకు పంపారు. అక్కడ సిబ్బంది పరీక్షలు చేసి మరో డాక్టర్ వద్దకు పంపారు. ఆ డాక్టర్ కోసం గంట నుంచి ఎదురు చూస్తున్నాను.

- నిర్మల, దోసపాడు, మేడికొండూరు

మందులు లేవు.. డాక్టరు రారు



ఉదయం 10 గంటలకు ఖాళీగా ఉన్న కంటి వైద్యుడి గది

ఆస్పత్రిలో అన్నిరకాల జబ్బులకు మందులు లేవు. మందుల కొరత తీవ్రంగా ఉంది. కొన్ని మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రోగికి ఏమాత్రం సీరియస్‌గా ఉన్నా వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి. చర్మవ్యాధుల డాక్టర్ ఆలస్యంగా ఉదయం 9.50 గంటలకు డ్యూటీలోకి వచ్చారు. అలాగే కంటి వైద్య నిపుణుడు ఉండే ఈసీటీ వార్డు ఉదయం 10 గంటల సమయంలో డాక్టర్ లేకుండా కనిపించింది. స్టాఫ్ నర్సులు 40 మందికి గాను కేవలం 18మంది మాత్రమే ఉన్నట్టు బోర్డులో పేర్కొన్నారు. శిక్షణలో ఉన్న నర్సింగ్ విద్యార్థులు సీనియర్ నర్సుల పర్యవేక్షణ లేకుండా రోగులకు వైద్యం అందించడం కనిపించింది.

స్కానింగ్, మందులూ బయటకే..



గర్భిణులకు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు రిఫర్ చేస్తూ వైద్యుడు రాసిచ్చిన చీటీ

గర్భిణులకు చేయాల్సిన స్కానింగ్ పరీక్షలు ప్రైవేట్ వైద్యశాలలకు రాసి వైద్యులు కమీషన్ నొక్కుతున్నారనే విమర్శలు వినవచ్చాయి. స్కానింగ్ పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ రేడియాలజిస్టు లేడన్న సాకు చూపించి పరీక్షలన్నీ బయటకు రాస్తున్నారు. అదేవిధంగా వైద్యశాలలో రెండు నెలల నుంచి మందులకు బడ్జెట్ కేటాయింపులు లేకపోవడంతో గర్భిణులకు మందులను ప్రైవేట్ మెడికల్ దుకాణాలకు రాస్తున్నారు. సమస్యను డీఎంహెచ్‌ఓ దృష్టికి గైనకాలజిస్టులు తీసుకువెళ్లడంతో పీహెచ్‌సీల నుంచి కొన్ని మందులు తీసుకువచ్చారు. అవి అరకొరగా ఉండటంతో మిగిలిన మందులు బయటకు తీసుకుంటున్నారు. తమకు నెలకు సుమారు రూ.1200 ఖర్చు అవుతుందని చెప్పి గర్భిణులు వాపోతున్నారు. గర్భిణులకు ఎంతో అవసరమైన యాంటీబయోటిక్, శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావాన్ని నివారించే మందులు, సర్జికల్ సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేయలేదు.

పరీక్షలకు గంటలకొద్దీ సమయం..



రోగిని కుటుంబీకులే చక్రాల కుర్చీలో తరలిస్తున్న దృశ్యం

ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు సరిపడా సౌకర్యాల కల్పనలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. సరిపడా కుర్చీలు, బల్లలు లేక రోగులు నేలపై కూర్చున్న దృశ్యాలు 'సాక్షి' కంటికి కనిపించాయి. ఆసుపత్రిలో నాల్గో తరగతి ఉద్యోగుల సమస్య తీవ్రంగా ఉంది. నడవలేని స్థితిలో ఉన్న రోగులను ఆసుపత్రిలోకి తీసుకువెళ్లడానికి సిబ్బంది లేకపోవడంతో రోగులు బంధువులే స్ట్రెచ్చర్, వీల్‌చైర్లను నెట్టుకొని పోతున్న దృశ్యాలు కనిపించాయి. ఇన్ పేషెంట్ విభాగాలలో ఫ్యాన్‌లు అన్ని పనిచేయక పోవడంతో రోగులు తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. రోగి రక్త పరీక్షలు చేయించుకోవాలంటే సుమారు గంటకు పైగా సమయం పడుతోంది. షుగర్, తీవ్ర జ్వరం, అతిసార వంటి వ్యాధులతో బాధపడేవారు గంటలకొద్దీ క్యూలైన్లలో వేచి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగులు ఉపయోగించే టాయిలెట్లకు తాళాలు వేసి ఉన్న దృశ్యాలు కనిపించాయి. ఆసుపత్రి పరిసరాలు చెత్తాచెదారంతో నిండియాయి. పారిశుద్ధ్య నిర్వాహణ సరిగా జరగడం లేదు.

న్యూస్‌రీల్

నేడు పతావిష్కరణ చేయనున్న మంత్రి మనోహర్



నరసరావుపేట: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో గల కేఎస్‌పీఆర్ జిల్లా క్రీడాప్రాధికార ప్రాంగణంలో 78వ జాతీయ స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. అనంతరం పోలీసు, ఎన్‌సీసీ దళాలచే గౌరవ వందనం స్వీకరించి ప్రజలకు సందేశం ఇస్తారు. మువ్వన్నెల బెలూన్లు ఎగుర వేసి స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు.

నరసరావుపేటకు చేరుకున్న మంత్రి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఆర్డీఓ పి.సరోజని, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, డీఎస్‌ఓ ఎస్.పద్మశ్రీ కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు.

చిలకలూరిపేటలో 47.4 మి.మీ. వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో చిలకలూరిపేటలో 47.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మొత్తం జిల్లాలోని 28 మండలాలకు గాను కేవలం మూడు మండలాల్లోనే వర్షం పడింది. యడ్లపాడులో 6.8మి.మి, పెదకూరపాడులో 7.4 మి.మీ వర్షం కురిసింది. జిల్లా మొత్తంపై 61.6 మిల్లీమీటర్ల వర్షం పడింది.

'ఉత్తమ' అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని అర్హులైన ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ-2024 అవార్డుకు ఈనెల 20వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యంలో పనిచేసే పాఠశాలల ఉపాధ్యాయులు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 15 సంవత్సరాల బోధనానుభవం ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓకు అందజేయాలని తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయులను సెప్టెంబర్ 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సత్కరించనున్నట్టు వివరించారు.

స్వాతంత్ర్య వేడుకకు పరేడ్ గ్రౌండ్ ముస్తాబు



గుంటూరు వెస్ట్: స్వాతంత్ర్య దిన వేడుకలకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానం అత్యంత సుందరంగా ముస్తాబైంది. భారీ వేదికతోపాటు రంగురంగుల ముగ్గులు, గ్యాలరీలు, స్టాల్స్ తదితర ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్ కుమార్, ఇతర జిల్లా అధికారులు వీటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం వచ్చే చిన్నారులకు తాగునీరు అందుబాటులో ఉంచి, ఎండ తగలకుండా కార్యక్రమం సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ తర్వాత మధ్యాహ్నం 12:15 గంటల వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సివిల్ సప్లైస్ డీఎం లక్ష్మి, డీఎస్ఓ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు



గురవాయపాలెంలో కరివేపాకు పంటను పరిశీలిస్తున్న కె.శ్రీనివాసులు, కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం గ్రామాల్లో సాగుచేస్తున్న ఉద్యాన పంటలను బుధవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. ఉప్పలపాడులో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించి రైతు షేక్ సాంబశివరావుతో మాట్లాడారు. పంట సాగు విస్తీర్ణం, సాగుకు అయిన ఖర్చు, ఉద్యానశాఖ ద్వారా అందిన సబ్సిడీ, పంట ఉత్పత్తి, ఆదాయ వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. నాలుగు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంటను సాగుచేయగా దాదాపు రూ.12లక్షలు ఖర్చు అయిందని రైతు తెలిపారు. మొదటి ఏడాది మూడు కోతల్లో రూ.5.5లక్షల ఆదాయం లభించిదన్నారు. ఉద్యాన శాఖ ప్రోత్సాహంగా రూ.48వేలు అందించినట్టు వివరించారు. అనంతరం గురవాయపాలెంలోని షేడ్ నెట్స్‌ను పరిశీలించారు. షేడ్ నెట్స్ ఏర్పాటుకు దాదాపు రూ.16లక్షలు ఖర్చు కాగా ఉద్యాన శాఖ 50శాతం సబ్సిడీని అందించిందని రైతు గురుస్వామి తెలిపారు. గత ఏడాది నారు విక్రయాల ద్వారా రూ.5లక్షల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. నారు పెంపకంలో ఉద్యాన శాఖ అధికారులు సలహాలు అందిస్తున్నారా అని రైతును ప్రశ్నించగా, నారు పెంపకంలో మెలకువలను ఉద్యాన అధికారులు నుంచి తెలుసుకుని నారును పెంచుతున్నట్టు తెలిపారు. అనంతరం డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగవుతున్న కరివేపాకు సాగును వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ హరినాథరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి, పీడీ ఏపీఎంఐపీ ఆంజనేయులు, మండల ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్, ఉద్యాన సిబ్బంది ఆంజనేయులు, వ్యవసాయ శాఖ సిబ్బంది హర్ష, షమీర్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటీసులపై పింఛన్ లబ్ధిదారుల ఆందోళన

సత్వరం పింఛన్లు పంపిణీ చేయాలంటూ ఎంపీడీఓకు వినతిపత్రం



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

శావల్యాపురం: అర్హత కల్గిన వారందరికీ పింఛన్లు అందజేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, పిచికలపాలెం గ్రామమాజీ సర్పంచ్ తిరివీధి రమణారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నోటీసులు అందుకున్న 26 మంది పిచికలపాలెం గ్రామానికి చెందిన పింఛన్ లబ్దిదారులతో కలిసి ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరివీధి రమణారావు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో మొత్తం 209 మందికి నోటీసులు అందజేశారని, వీరంతా గతంలో సదరన్ శిబిరంలో వైద్యులు ధ్రువీకరణ చేసిన పత్రాలు ఆధారంగా పింఛను పొందుతున్నవారేనన్నారు. ఒంటరి మహిళ, డప్పు కళాకారులు, దివ్యాంగ పింఛనుదారులకు నోటీసులు అందజేయడం విడ్డూరమన్నారు. అధికారులు సత్వరమే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కుడికాలువకు రెండోవారం నుంచి నీరు విడుదల

ఎన్ఎస్‌పీ గుంటూరు చీఫ్ ఇంజినీర్ కె.రవి

సత్తెనపల్లి: నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలోని ఆయకట్టుకు ఈ నెల రెండోవారం నుంచి సాగు నీరు విడుదల చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని నాగార్జునసాగర్ ప్రాజెక్టు గుంటూరు చీఫ్ ఇంజినీర్ కె.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలువ పరిధిలోని జోన్-1(పల్నాడు, గుంటూరు జిల్లాలు - పమిడిపాడు బ్రాంచ్ కాలువ మినహా) ఈ నెల రెండో వారం నుంచి, జోన్-2 (ప్రకాశం, బాపట్ల జిల్లాలు)కు సెప్టెంబర్ నెల మొదటి వారం నుంచి సాగునీరు విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఆయకట్టు పరిధిలోని రైతులు నారుమడులు, మిర్చి, పత్తి, ఇతర పంటలకు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

దేశభక్తి చాటేలా 'హర్ ఘర్ తిరంగా'



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు కోరారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటిపైన మువ్వన్నెల జెండా ఎగురవేయాలని అన్నారు. బుధవారం కలెక్టర్ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలపై టెలికాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి జాతీయ జెండాలను చేతపట్టి ర్యాలీలు నిర్వహించాలని, వాటి ఫొటోలను తీసి హర్‌ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలనీ జిల్లా విద్యాశాఖాధికారికి సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో జాతీయ సమైక్యతపై పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. మండల ప్రధాన కేంద్రాలు, అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరూ సెల్ఫీ దిగి ఫొటోను వెబ్‌సైటులో అప్లోడ్ చేయాలనీ మండల అధికారులు, కళాశాలల యాజమాన్యాలకు సూచించారు. డీఆర్వో కె.వినాయకం, మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలన..

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కోడెల శివప్రసాదరావు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలసి పరిశీలించారు. స్టేజీ ఏర్పాటు, వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు, స్టాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. వాటిపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.సరోజిని, రోడ్లు భవనాల శాఖ అధికారి రాజానాయక్, డీఆర్‌డీఎం పీడీ బాలూనాయక్, అడిషనల్ ఎస్పీ రాఘవేంద్రరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల కడుపు నింపేలా అన్న క్యాంటీన్‌లు

పురపాలక శాఖ మంత్రి నారాయణ



నెహ్రూనగర్: ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం ద్వారా పేదల కడుపు నింపే బృహత్తర కార్యక్రమానికి స్వాతంత్ర్య దినోత్సవాన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టనున్నారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. బుధవారం రాత్రి గుంటూరులోని చుట్టుగుంటలోని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి నారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్లా మాధవి తదితరులు పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యాం ప్రసాద్, ఈఈ సుందరరామిరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నార్త్ జోన్ డీఎస్పీగా మురళీకృష్ణ



మంగళగిరి: మంగళగిరి నార్త్ జోన్ డీఎస్పీగా సీహెచ్ మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బాపట్ల డీఎస్పీగా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజులలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

203 పరుగుల ఆధిక్యంలో తూర్పు గోదావరి జట్టు

మంగళగిరి: ఏసీఏ అండర్- 19 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో బుధవారం రెండో రోజు ప్రకాశం జట్టుపై ఈస్ట్ గోదావరి జట్టు 203 పరుగులు ఆధిక్యత సాధించింది. ఈ పోటీలు మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతున్న విషయం తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన ఈస్ట్ గోదావరి జట్టు 112.2 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 369 పరుగులు సాధించింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్ ఎస్వీ ఆనంద్ 103 పరుగులు సాధించాడు. బ్యాట్స్‌మెన్లు డి. ఆకర్ష్ 67, ఎస్వీ ప్రణయ్ 58 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ప్రకాశం జట్టు 17 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 45 పరుగులు చేసింది. మూడో రోజు ఆట గురువారం కొనసాగనుంది.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



లక్ష్మీపురం: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. గుంటూరు కన్నావారితోటలోని జీఎస్టీ భవన్‌లో విశ్రాంత ఉద్యోగులకు బుధవారం 'పెన్షన్ అదాలత్' జరిగింది. ముందుగా కమిషనర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల కంటే పెన్షనర్ల ఇబ్బందులు తీర్చడానికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే ఎప్పుడైనా తనను కలవొచ్చని పేర్కొన్నారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు గద్దె తిలక్, టి.వివేకానందలు మాట్లాడుతూ.. కమిషనర్ తమకు బాసటగా నిలవటం అభినందనీయం అన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి. లక్ష్మీనారాయణ, అధికారులు సీతారామరాజు, పాండురంగారావు, సచ్చిదానంద, జవహర్ బాబు, కల్పన, గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, పూర్ణ సాయి, ప్రశాంత్, సుధీర్, పెన్షనర్ల సంఘ నాయకులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు .

17న ఎస్జీటీల సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ ప్రక్రియ ఉంటుందని డీఈవో పి.శైలజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్జీటీలు ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు పుస్తకంతో హాజరు కావాలని సూచించారు.

20న క్యారమ్స్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని బ్లాక్-2లో రాష్ట్ర స్థాయి బాల, బాలికల క్యారమ్స్ జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ఏపీ స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 17వ తేదీ సాయంత్రంలోపు 99511 15678 ఫోను నంబర్‌లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

రెంటచింతలలో బాపూ అడుగు జాడలు



శ్రీ ఎల్ఎల్ఆర్ ప్రాథమిక పాఠశాల



పలనాడు గాంధీ నాళం మట్టపల్లి(ఫైల్)



మహాత్మాగాంధీ నూలు వడికిన రెంటచింతలలోని వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల

రెంటచింతల: జాతిపిత మహాత్మాగాంధీ పాద స్పర్శతో పల్నాడు సీమ పులకించిపోయింది. దేశ స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా జరుగుతున్న 1929 సంవత్సరంలో పలనాడు గాంధీగా పేరుపొందిన నాళం మట్టపల్లి జాతిపిత మహాత్మ గాంధీజీని వేసవి కాలంలో మంటచింతలగా పేరు పొందిన రెంటచింతలకు తీసుకువచ్చారు. స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మగ్గాలను ఏర్పాటు చేసి గ్రామానికి చెందిన పలువురితో కలిసి గాంధీజీ నూలు వడికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు స్వాతంత్ర్య సమరయోధులతో స్వాతంత్ర్య ఉద్యమ ఆవశ్యకతపై గాంధీజీ సుదీర్ఘంగా ప్రసంగించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. దీనికి గుర్తుగా పాఠశాల ఎదురుగా ఉన్న కాలనీకి గాంధీనగర్‌గా నామకరణం చేశారు. స్థానిక శ్రీ లాలా లజపతిరాయ్(ఎల్ఎల్ఆర్) ప్రాథమిక పాఠశాలకు గాంధీజీ భూమి పూజ చేశారు. అప్పటి నుంచి నాళం మట్టపల్లి పలనాడు గాంధీగా ఈ ప్రాంతంలో పేరుపొందారు. ప్రతి సంవత్సరం ఆగస్టు నెల 15వ తేదీ వచ్చిందంటే గ్రామానికి చెందిన పలువురు వృద్ధులు ఇప్పటికీ నాటి సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటుంటారు.

సాగర్ డ్యాంపై 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసన్, అధికారులు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం పై సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీనివాసన్ నేతృత్వంలో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా కంపెనీ కమాండర్ ఎఫ్ 234 ఎస్.శ్రీనివాసన్ అధ్యక్షతన సాగర్ ప్రధాన డ్యాం నుంచి అంబేద్కర్ సెంటర్, మెయిన్‌బజార్, డౌన్ మార్కెట్, లాంచీ స్టేషన్ వరకు సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసన్ మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండా ప్రతి ఇంటిపై ఎగరాలనే ఉద్దేశంతో తమ సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా విజయపురిసౌత్‌లోని పలు ప్రాంతాలలో బైక్ ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కలిగించామన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారిలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పారిక్ రాయ్, ఎస్ఐ నార్సింగ్, సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మార్టూరు: మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు ఏఎస్ఐ మహబూబ్ బాషా బుధవారం తెలిపారు. నాగరాజు పల్లి గ్రామంలోని ఎర్ర చెరువులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించిన వీఆర్ఏ గల్లా శేషయ్య సమాచారం అందించారు. సుమారు నాలుగు రోజుల క్రితం చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన పురుషునిగా గుర్తించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్నాక్స్ అందించండి..!

- స్వాతంత్ర్య వేడుకలకు సచివాలయ ఉద్యోగులకు డ్యూటీ
- తమను అవమానిస్తున్నారని సిబ్బంది ఆవేదన
- బీటెక్, ఎంటెక్‌లు చదివిన మాకు ఈ పనులా?
- ప్రభుత్వ తీరును ఖండించిన రాష్ట్ర అధ్యక్షుడు రజాక్



సచివాలయ ఉద్యోగులు స్నాక్స్ అందించాలంటూ ఇచ్చిన ఆదేశాలు

గుంటూరు వెస్ట్: 'స్వాతంత్ర్య వేడుకలకు వచ్చే వారికి స్నాక్స్ అందించండి...' ఇది కేటరింగ్ సిబ్బందికి ఇచ్చిన ఆదేశం కాదు సుమా! ఏకంగా సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశం. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సచివాలయ సిబ్బందికి అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా గురువారం గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్న స్వాతంత్ర్య వేడుకలో ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఈ వేడుకలకు హాజరయ్యే అతిథులకు టీ, కాఫీ, స్నాక్స్‌లాంటివి అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదకాకాని మండలాలకు సంబంధించిన వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 50 మందిని దీనికోసం నియమించారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు వీరందరూ స్నాక్స్ అందించే పనిలోనే నిమగ్నమై ఉండాలి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కఠినతరమైన పరీక్షా విధానంలో సుమారు 1.20 లక్షల మందిని సచివాలయాల్లోని వివిధ విభాగాలకు నియమించింది. గ్రూప్-3 క్యాడర్‌ను కూడా కేటాయించింది. దీంట్లో 75 శాతంపైగా బీటెక్ గ్రాడ్యుయేట్లు ఉండగా, మిగతా వారిలో ఎంటెక్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన వారు కూడా ఉన్నారు. ఒక విధంగా దేశంలో సచివాలయ సిబ్బంది ఒక సంచలనమే చెప్పాలి. ఎన్నో రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వచ్చి ఈ వ్యవస్థ పనితీరును అభినందించారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ వ్యవస్థలోని యువ ఉద్యోగులను స్నాక్స్ అందించేందుకు అధికారులు నియమించడం అత్యంత దారుణమని బాధితులు వాపోతున్నారు. ఇలాంటి పనులకు వీఆర్ఏ, అంగన్‌వాడీలు, మున్సిపల్ సిబ్బందిని నియమిస్తారు.

ఇది అత్యంత దారుణం

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దారుణం. ఉన్నత విద్యనభ్యసించి, గౌరవ ఉద్యోగంలో పారదర్శకంగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బందిని స్నాక్స్ అందించేందుకు నియమించడం తీవ్రంగా బాధిస్తోంది. ఉద్యోగులు కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తాం. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటాం.



– షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

కుటుంబ కలహాలతో కుడికాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య



చక్కా రాజేష్ (ఫైల్)

మాచర్లరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో కుడికాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం బుగ్గవాగు రిజర్వాయర్ వద్ద జరిగింది. వివరాలలోకెళ్తే... పట్టణానికి చెందిన చక్కా రాజేష్ (30) రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో గొడవపడి జమ్మలమడక గ్రామ సమీపంలోని నాగార్జునసాగర్ కుడికాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోషల్ మీడియాలో తన కుటుంబంలో తగాదాలు ఉన్నట్లు వాటిని తాను తట్టుకోలేకపోతున్నానంటూ పోస్టు చేసి కాలువలోకి దూకాడు. రెండు రోజులపాటు గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం బుగ్గవాగు రిజర్వాయర్‌లో రాజేష్ మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి రాజేష్ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యుల సంఘం నేతలు

గుంటూరు మెడికల్: వైద్యులకు రక్షణ కల్పించాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై గుంటూరు మెడికల్ కళాశాల జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జీజీహెచ్‌లో నిరసన తెలిపారు. వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులు, వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్యురాలిని పొట్టన పెట్టుకున్న నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్స్ యూనియన్ నేతలు ఎస్ఎస్వీ రమణ, శ్రీనివాస ప్రసాద్, సంతోష్, నారాయణ రావు, శైలజ, శ్రీనివాస్, భాను ప్రకాష్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌తో కేంబ్రిడ్జి వర్సిటీ అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీతో లింగ్వాస్కిల్ సర్టిఫికేషన్ ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ఇంగ్లిష్ అసెస్మెంట్ విభాగం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకుందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఓయూకు సంబంధించిన పత్రాలను కేంబ్రిడ్జి వర్సిటీ తరఫున సౌత్ ఏసియా రీజినల్ డైరెక్టర్ అరుణాచలం, సౌత్ ఇండియా డీజీఎం కార్తి సుబ్రమణియన్‌లు, విజ్ఞాన్ వర్సిటీ నుంచి రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పరస్పరం అందించుకున్నారు. ఈ సందర్భంగా నాగభూషణ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా తొలిసారిగా ఈ అంశాన్ని తమ వర్సిటీలోనే ప్రయోగాత్మకంగా కేంబ్రిడ్జి వర్సిటీ ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. పరిశోధనల్లో సహకారం, విద్యార్థుల భాషా నైపుణ్యంపై కేంబ్రిడ్జ్ సర్టిఫికేషన్ పరీక్షల ప్రభావాన్ని అధ్యయనం చేసే ఉమ్మడి ప్రాజెక్ట్ ఇప్పటికే పురోగతిలో ఉందని వెల్లడించారు. ప్రత్యేక కోర్సుల ఫలితంగా ఇక్కడి విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆంగ్ల భాషను నేర్చుకోగలుగుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కేంబ్రిడ్జి కార్పొరేట్ రిలేషన్స్ రీజినల్ మేనేజర్ పద్మజ శివకుమార్, ఈఎల్‌టీ మేనేజర్ మల్లికార్జున నాయుడు పచిపాల, విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పెద్ది రోజా

గుంటూరు వెస్ట్: జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే దిశగా అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు సహకరించాలని డీఆర్వో పెద్దిరోజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో స్పెషల్ సమ్మరి రివిజన్ 2025పై వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. రోజా మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు ఎస్ఎస్ఆర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరిని ఓటర్లుగా నమోదు చేసేందుకు కృషి జరగాలన్నారు. బీఎల్వో ద్వారా ఇంటింటి వెరిఫికేషన్ చేయాలని సూచించారు. 1,500 మంది ఓటర్లపైగా ఉంటే అక్కడ అదనంగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 అదనపు పోలింగ్ స్టేషన్‌లను గుర్తించామన్నారు. కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు పదవీ కాలం వచ్చే మార్చి నాటికి ముగుస్తుందని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల గ్రాడ్యుయేషన్ నమోదు కార్యక్రమం సెప్టెంబరు 30న నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో నివాసం ఉంటున్న వారు ఓటర్లుగా నమోదు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అడిషనల్ కమిషనర్ ఎ.లక్ష్మీశివజ్యోతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీడీసీసీ బ్యాంకులో రూ.6 కోట్ల మేర అవకతవకలు!

సాక్షి నెట్‌వర్క్: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో సుమారు రూ.6 కోట్ల మేరకు అవకతవకలు జరిగినట్లు బ్యాంక్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం... గురజాల మండలంలోని గంగవరం గ్రామంలోని కోల్డు స్టోరేజ్‌లో గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో మిర్చి నిల్వలు చూపించి సుమారుగా 150 మంది రైతులు బ్యాంకు ద్వారా ఒక సంవత్సరానికి రుణం తీసుకున్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు కోల్డు స్టోరేజ్‌లో మిర్చి నిల్వలు పరిశీలించేందుకు వెళ్లారు. బ్యాంకు అధికారు పరిశీలనలో రుణం తీసుకున్న రైతుల పేరుతో స్టోరేజ్‌లో ఒక్క మిర్చి బస్తా కూడా నిల్వ లేకపోవడంతో అవాక్కయ్యారు. రుణం పొందిన రైతులను నిలదీయగా మేము ఎప్పుడో రుణం చెల్లించామని కొందరు.. మాకు మిర్చి నిల్వలు లేవని తాము ఎటువంటి రుణం తీసుకోలేదని మరి కొందరు అధికారులకు తెలిపినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు రైతులను మోసం చేశారా లేదా మిర్చి నిల్వలు లేకపోయినా ఉన్నట్లుగా బ్యాంకు అధికారులను మోసం చేశారా అన్న విషయాలను గుర్తించే పనిలో బ్యాంకు అధికారులు ఉన్నట్లు సమాచారం.

స్వతంత్ర పోరు సాగిందిలా...

విద్యార్థులకు వివరించిన శతాధిక వృద్ధుడు



శేషిరెడ్డితో చిన్నారులు

మున్నంగి(కొల్లిపర): స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రత్యక్షంగా చూసిన 103 ఏళ్ల ఆళ్ళ శేషిరెడ్డి ఆనాటి సమర ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. మండలంలోని మున్నంగి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్) విద్యార్థులు ఉత్సాహంగా అప్పటి విషయాలను తెలుసుకున్నారు. తన నివాసంలో శేషిరెడ్డి చిన్నారులతో మాట్లాడుతూ.. తన తండ్రి వెంకటరెడ్డి మునసబుగా ఉండేవారని, ఆయనతోపాటు అనుచరులను కూడా అప్పట్లో ఆంగ్లేయులు జైల్లో పెట్టినట్లు తెలిపారు.

తనకు 25 ఏళ్ల వయసు ఉన్నప్పుడు తండ్రితో కలిసి గాంధీ, నెహ్రూ, చక్రవర్తుల రాజగోపాలాచారి వంటి వారిని దగ్గరగా చూశానని గుర్తు చేసుకున్నారు. ఆంగ్లేయుల పరిపాలనలో ప్రజల్ని ఎన్నో బాధలు పెట్టేవారని వివరించారు. దేశంపై ప్రతి ఒక్కరు ప్రేమాభిమానాలతో ఉండాలని కోరారు. పరస్పరం గౌరవించుకుంటూ అన్నదమ్ముల్లా సాగాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రాము, ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీకమల తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల స్మారక ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



లక్ష్మీపురం: స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకునేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్ ఒకటో ప్లాట్‌ఫాంపై హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటైన ఈ ఎగ్జిబిషన్‌ను బుధవారం డీఆర్ఎం ప్రారంభించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సందర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో నాటకాలను ప్రదర్శించారు. సీనియర్ డీపీఓ హనూర్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.







సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- Join M.Com, MA English, MSW-get Scholarships Qualified PG Set, BSc Com/ Elect, B.Com Comp, BA EC / HI / SP Eng. PLNM Degree College ✆ 9177408565
- Free Education in Germany - 3 years course. Age : 18 - 28 yrs. (Hospitality, Food, Technology, Nursing). Qul : Inter ✆ 91053 69999

REAL ESTATE

- గుంటూరులో కమర్షియల్ మరియు రెసిడెన్షియల్ ఇళ్లు, స్థలాలు, పొలాలు, ప్లాట్లు, అమ్మదలచినా కొనదలచినా సంప్రదించగలరు. 62814 94079

FLAT FOR SALE

- బ్రాడీపేట 6/19 Rainbow Rich Land సూపర్‌డీలక్స్ 3 BHK 1800 Sft తూర్పు ఉత్తరం ఫ్లాట్స్ గృహ ప్రవేశమునకు సిద్ధముగా కలవు. సంప్ర: 9704139333, 9885700115
- పల్లవి నివాస్: ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వేగేటు దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 40 లక్షలకే. ఫోన్ 98481 10543, 70938 09070.

PLOTS FOR SALE

- అమరావతి రాజధానికి & గుంటూరు టౌన్‌కి దగ్గరలో చ॥గ॥ 10వేలు నుంచి డెవలప్మెంట్, అప్రూవల్స్‌తో, ఇన్వెస్ట్మెంట్ & ఇల్లు కట్టుకునే విధంగా బ్యాంకులో సొమ్ముతో ప్లాట్లు కలవు. 7794977430
- రాజధాని గుంటూరు విజయవాడలో 15 సెంట్లలో CRDA ఫ్లాట్స్ పూలింగ్ ల్యాండ్స్, అపార్ట్‌మెంట్స్, వెంచర్స్‌కి పొలాలు, ఫామ్‌ల్యాండ్స్ అతి తక్కువ ధరలో కలవు. ✆ 99904 51999.

TOLET COMMERCIAL

- గుంటూరు, అరండల్‌పేట 4/1, స్వర్ణలోక్ కాంప్లెక్స్ 3వ అంతస్తులో 3500 చ॥అ॥ల బిల్డింగ్ ఆఫీస్‌లకు షోరూంలకు అద్దెకి ఇవ్వబడును. ఫోన్: 9848114463

WANTED

- ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు డిగ్రీ లేదా B.Tech చేసిన వారు కావలెను. ఇంగ్లీష్ బాగా మాట్లాడగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును ✆ 8143579659
- ఇంటి వద్దనే ఉండి 0/- రూపాయలతో సులభమైన ఆదాయం మీ ఫోన్ ద్వారా పొందాలనుకునేవారు వెంటనే సంప్ర॥ ✆ 7013703230, 9000441177
- Wanted Qualified and Experienced Teachers for 1 to 5th Classes All Subjects. Sumedha High School, Nggo's Collony, Guntur. 94408 84154
- ఉచిత కంప్యూటర్ శిక్షణ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు 3 నెలలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించబడును. స్త్రీలకుమాత్రమే.వ.18-30సం.ఫ్రీహాస్టల్,ఫ్రీభోజనం సంప్ర: గుంటూరుమహిళాప్రాంగణము ✆ 8500817856
- YIP PVT LTD recruits Male or Female Age 18 to 45, Qul: 10th to Any Degree, Salary 18000 and above work from home facility is available. 8121818692
- శ్రీ లక్ష్మీ హోంకేర్ : హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బెడ్‌సైడ్ ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17,000/- రూం+మీల్స్ ఫ్రీ. 9347148051
- Wanted Male Academic Principals Qualification Any Degree/P.G. Age Limit: 30 to 45years. Salary: 30,000/- to 35000/- Working Location: Guntur. Contact: 8008556069
- హాస్టల్ ఇన్‌చార్జిలు, ల్యాబ్ ఇన్‌చార్జులు మరియు ఫ్లోర్ ఇన్‌చార్జిలుగా పనిచేయుటకు స్త్రీలు మరియు పురుషులు కావలెను. జీతము: 10,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. మరియు ఉచిత భోజనం మరియు వసతి కల్పించబడును. విద్యార్హతలు : ఇంటర్ లేదా డిగ్రీ, వయస్సు: 23+, ఆసక్తిగల అభ్యర్థులు మాస్టర్ మైండ్స్‌ను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్. 8248441579
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K, ఫోన్ : 9160900024, 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం. ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం. గుంటూరు 7075167541 7075167663

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.